# ఏజెంట్ భీమారావు

- ఇలపావులూరి మురళీమోహనరావ్

గేటు తీసుకుని కుంటుకుంటూ లోపలకొస్తున్న వెంకట్రావును చూసి కంగారుపడి ఎదురెళ్ళింది సుందరి.

"అయ్యో... ఏంటండీ దెబ్బలు? పొద్దున బాగానే వెళ్ళారుగా ఆఫీసుకు? ఇప్పుడిదేంటిలా వస్తున్నారు? కాలికీ బ్యాండేజీ ఏంటి? ఎక్కడైనా పడ్డారా? యాక్సిడెంటయిందా?" గబగబ అడిగింది.

"అబ్బ... ఏమిటి నీ ఇంటరాగేషన్? ఇప్పటిదాకా పోలీసుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక చచ్చాను. ఇంటికి రాగానే నీ గోలేంటి?" విసుక్కున్నాడు వెంకట్రావు.

"పోలీసులా? ప్రశ్నలా? మిమ్మల్నెందుకడిగారు? మీరేమైనా దొంగతనాలు చేశారా? మర్డర్లు చేశారా? మానభంగాలు చేశారా?"

"అబ్బబ్బ... మళ్ళీ అదే నస! ఫస్ట్ షోకు వెళ్దామన్నావుగదాని కొంచెం స్పీడుగా వస్తున్నా. ఎదురుగా వస్తున్న లారీ గుద్దింది."

" ఎదురుగా వస్తున్న లారీ గుద్దిందా? అవ్వ... అవ్వ... నాలుగు కళ్ళున్నా ఎదురుగా వస్తున్న లారీ కనిపించలేదా? ఏదైనా పరధ్యానంలో ఉన్నారా?"

"ముందు నీ నస ఆపు. లోపలకు పద. కాసేపు పడుకోవాలి." సుందరి భుజం మీద ఆసరా కోసం చెయ్యి వేశాడు వెంకట్రావు.

"స్కూటరేదీ?"

"అది పప్పుముద్దయింది."

"అయ్యో... ఎంతపని జరిగింది! కాసేపు రెస్టు తీసుకోండి. ఈ లోపల కాఫీ తెస్తాను." వంటింట్లోకి వెళ్ళింది.

ఎలా తెలిసిందో ఏమో వెంకట్రావుకు యాక్సిడెంటైనట్లు కాలనీ మొత్తం క్షణాల్లో పాకిపోయింది. వీధిలో వారంతా వచ్చి పరామర్శించసాగారు.

ఆ వచ్చిన వారిలో ఒకడు భీమారావు. యల్. ఐ.సి. ఏజెంటుగా పనిచేస్తున్నాడు.

"సారీ గురూ... నీకు యాక్సిడెంటయిందని తెలిసి చాలా విచారిస్తున్నాను. నువ్వేం విచారించకు. యాక్సిడెంట్ పాలసీ ఏమైనా తీసుకున్నావా? వెంటనే డబ్బులిప్పించే పూచీ నాది" ఓదారుస్తూ అన్నాడు.

"నా కలాంటివేమీ లేవు" మూలుగుతూ చెప్పాడు వెంకట్రావు.

"అయ్యయ్యో... నీకసలు ఏ పాలసీ లేదా?"

"లేదు. నేను తీసుకోలేదు."

"ఛ.. ఛ... నీ పాలసీ ఏం బాగాలేదు. అదే ఏ లక్షకో రెండు లక్షలకో పాలసీ తీసుకున్నట్లయితే నీకా డబ్బులన్నీ వచ్చేవి కదా!"

" ఏడిసినట్లుంది. ఇలా యాక్సిడెంటౌతుందని నేనేమైనా కలగన్నానా?

"వెరీ బ్యాడ్... ఊహించనివి జరగడమే విధి విలాసం అంటే. మనిషి జీవితం బుద్బుదప్రాయం. నువ్వు వెంటనే పది లక్షలకు పాలసీ తీసుకో." సంచిలోంచి ఫారాలను బయటకు తీశాడు భీమారావు.

"వద్దొద్దు... తీసుకున్నవాడు చస్తేనేగా మీ పాలసీలవల్ల లాభం... నేను బ్రతికుండగా అనుభవించలేనపుడు ఎందుకా పాలసీలు?"

"అదేమ్మాట్రా... నీ సుఖమేనా నువ్వు ఆలోచించేది? భార్యా పిల్లల సంగతి చూసుకోవద్దూ? ఇవాళ నీ అదృష్టం బాగుంది కాబట్టి సరిపోయింది. అదే మరోలా జరిగుంటే... ఇహ నువ్వేమీ ఆలోచించకుండా పది లక్షల పాలసీ తీసుకో."

"ఒకవేళ ఆయనకేదైనా అయితే" అడిగింది సుందరి.

"యల్.ఐ.సి. వారు పువ్వుల్లో పెట్టి పదిలక్షలు మీకిస్తారు."

"ఒకవేళ పాలసీ తీసుకున్న మర్నాడే పోతే?"

"మిమ్మల్ని అరెస్టు చేస్తారు. కోర్టువారు మీకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష వేస్తారు"

"అయ్యో... అదేంటండీ..."

"లేకపోతే ఏంటండీ... పాలసీ తీసుకున్న మర్నాడే పోతే ఎవరికైనా అనుమానం రాదూ... కనీసం నాలుగైదు నెలలన్నా గడవాలి. అప్పుడు ఏదైనా రోగంతో పోయినా, యాక్సిడెంట్లో పోయినా వెంటనే డబ్బు దొరుకుతుంది."

వాళ్ళ సంభాషణ వింటుంటే వెంకట్రావుకు పుండుమీద కారం చల్లినట్లు వళ్ళు మండింది.

"ఆపండి మీ వెధవగోల. నా చావు గురించి ఏంటా బోడిముండ చర్చ?" నేను చచ్చినా పాలసీ తీసుకోను." అరిచాడు.

"అంతెలెండి. మీరు సుఖంగా ఉండాలి. మీ తరువాత మేము బస్టాండుల్లో బిచ్చమెత్తుకున్నా, రైల్వే స్టేషన్లో రేకు డబ్బా వాయించుకుంటూ అడుక్కున్నా మీకు అనవసరం." ముక్కు ఎగబీలుస్తూ అన్నది సుందరి.

"అవున్రా... నువ్వు చెల్లెమ్మ భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకోవాలి." అన్నాడు భీమారావు.

బ్యాండేజ్ పోతే పోయిందిలే అనుకుని శక్తినంతా కూడదీసుకుని భీమారావును ఎగిరి తన్నాడు వెంకట్రావు.

* * *

నెల తరువాత-

వళ్ళంతా చెమటలు కక్కుతూ, ప్రాణ భయంతో రొప్పుతూ తలుపును బలవంతంగా తోసుకొని లోపలకొచ్చి నమస్కారం పెడుతూ 'వాళ్ళకు నేను లేనని' చెప్పు అని సమాధానం కోసం కూడా చూడకుండా బెడ్‌రూమ్‌లోకి పరుగెత్తి మంచంకింద దాక్కున్న భీమారావును చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు.

అటు ఇటు చూస్తుండగానే బలిష్టులైన యువకులు ప్రత్యక్షమయ్యారు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అడిగాడు వెంకట్రావు.

"సార్ ... ఎవడైనా యల్.ఐ.సి. ఏజెంట్ ఇటు వచ్చాడా?" అడిగాడో యువకుడు.

"ఎవరూ రాలేదే... ఏమైంది?" ఏదో ప్రమాదం ఊహించి అడిగాడు వెంకట్రావు.

"ఏం లేదులెండి." అంటూనే బయటకు పరిగెత్తారు వాళ్ళు.

ఐదు నిమిషాల తరువాత గడగడలాడుతూ బయటకొచ్చాడు భీమారావు.

"థాంక్సరా... ప్రాణ గండం నుంచి తప్పించావు." అన్నాడు భీమారావు.

"ఏమైందిరా? ఎవరు వాళ్ళు?" అడిగాడు వెంకట్రావు.

గతంలో కెళ్ళాడు భీమారావు.

* * *

అన్నపూర్ణ కల్యాణ మంటపం.

పీటలమీద వధూవరులు కూర్చున్నారు. తన జీవితంలో తుదిసారిగా నవ్వుతున్నాడు పెళ్ళి కొడుకు. అలాగే జీవితంలో చివరిసారిగా తలవంచుకుని కూర్చున్నది పెళ్ళికూతురు. పురోహితుడు వేద మంత్రాలను పఠిస్తున్నాడు.

అతిథులంతా కుర్చీలలో ఆశీనులై ఉక్కపోతను భరించలేక విసురుకుంటూ ఎప్పుడెప్పుడీ తతంగం అయిపోతుందా, డైనింగ్ హాల్లో దూరుదామా అని ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

ముహూర్తం దగ్గరపడింది. మంగళసూత్రధారణకు అనుమతినిచ్చాడు పురోహితుడు. మరుక్షణంలో తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోబోతున్నానని తెలియని ఆ అమాయకుడు మంగళసూత్రాన్ని తీసుకుని లేచాడు.

"ఆపండి" సింహగర్జన వినిపించడంతో అంతా ఉలికిపడి వెనక్కు తిరిగారు.

చేత సంచీతో నిలబడి ఉన్నాడు భీమారావు. పెద్ద పెద్ద అంగలతో వరుడిని సమీపించాడు.

"నాయనా... బాబూ... ఆనందకరమైన నీ జీవితానికి ఈ మంగళసూత్రధారణతో మంగళం పాడబోతున్నావు. గత జన్మలోని మన ఆగర్భ శత్రువులు ఈ జన్మలో మన భార్యలుగా వస్తారట. భార్యా భర్తలన్న తరువాత కీచులాటలు తప్పవు. ఒక్కోసారి అవి భీకర సంగ్రామాలుగా రూపాంతరం చెందుతాయి. నువ్వు ఏమరుపాటుగా ఉన్నప్పుడెపుడైనా నీ భార్య నిన్ను రోకలి బండతో బాదవచ్చు. లేదా పాయసంలో సైనైడ్ కలిపి తీపిమాటలతో నీ నోటికందించవచ్చు. అపుడు నీ పిల్లలు, తల్లిదండ్రులు అన్యాయమైపోతారు. వాళ్ళు జోలె పట్టుకుని బస్టాండు వద్ద తిరుగుతారు. అందుకని నా మాట విను. వెంటనే పాలసీ తీసుకో. నువ్వుపోయిన మరుక్షణం డబ్బంతా తెచ్చి నీ తల్లిదండ్రులకు, పిల్లలకు అందించే పూచీ నాది. ఈ ఫారం మీద చిన్న సంతకం పెట్టు. మీ వాళ్ళెంత ఆనందంగా జీవిస్తారో నువ్వు పైలోకాల నుంచి దివ్య దృష్టితో వీక్షించవచ్చు." ఉత్సాహంగా వాగాడు.

అందరూ నిశ్చేష్టులయ్యారు.

వధువువైపు తిరిగాడు భీమారావు.

"అమ్మా... నువ్వైనా నా మాట విను. అత్తింట ప్రవేశమంటే అగ్నిప్రవేశమే. రేపెపుడైనా ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత నీ మగడికి నీ మీద విరక్తి కలగవచ్చు. మరో సెటప్పు చూసుకుని నిన్ను వదిలించుకోవాలని ప్రయత్నించవచ్చు. ఇంకా కట్నం కావాలని నిన్ను రాచి రంపాన పెట్టవచ్చు. నీ భర్త నిన్ను కట్టేస్తే, నీ ఆడపడుచులు నీ మీద కిరోసిన్ కుమ్మరిస్తే అత్తగారు అగ్గిపుల్ల విసరవచ్చు. ఆ వచ్చే రెండో భార్య నీ బిడ్డల్ని తన్ని తరిమెయ్యొచ్చు. అప్పుడు వాళ్ళు అనాథలై అన్నమో రామచంద్రా అని అల్లాడుతూ చెత్త కుండీల్లోకి తొంగిచూస్తుంటే నీ ఆత్మకు శాంతి ఉంటుందా? అందుకని వెంటనే ఐదు లక్షలకు పాలసీ చెయ్యి. ఇవిగో ఫారాలు. పెట్టు సంతకాలు." ఆశగా చెప్పాడు భీమారావు.

అప్పటికే చొక్కా చేతులు ముడిచి తన వెనుకకు వచ్చిన యువకులను వీపు విమానం మోత మోగిందాకా గమనించలేదు భీమారావు.

* * *

"ఛీ... ఛీ... నీ కసలు మాట్లాడటం తెలీదు. ఇలాగైతే నువ్వు ఇన్సూరెన్సు ఏజెంట్‌గా రాణించలేవు. పాలసీ కట్టిన తరువాత చస్తే లాభమే కానీ మరీ అలా మొహమ్మీద చెబితే ఎలా? పచ్చని పెళ్ళి పందిట్లో చావు, తద్దినం లాంటి మాటలు మాట్లాడితే వాళ్ళకు మండదూ. చిటికెలో చావు తప్పించుకునొచ్చావు. నాలుగు రోజులు ఎక్కడైనా దాక్కొని



మళ్ళీ ఆరంభించు." చివాట్లు పెట్టి పంపించాడు వెంకట్రావు.

* * *

నగరంలోని కోటీశ్వరులలో ఒకడైన ధర్మరాజు విశాలమైన లాన్లో భార్య ధనలక్ష్మితో నిలుచుని ఆరోజే ఏభై లక్షలు పెట్టి కొన్న ఇంపోర్టెడ్ కారును మురిపెంగా చూస్తున్నాడు. ఆ కారులోని ఫీచర్లను భార్యకు ఉత్సాహంగా వివరిస్తున్నాడు.

"నమస్కారం సార్..." ప్రవేశించాడు భీమారావు.

"ఎవరు మీరు?" అడిగాడు ధర్మరాజు.

"ఇన్సూరెన్స్ ఏజెంట్నండీ. భీమా చేయించు – ధీమాగా జీవించు అన్నది నా పాలసీ అండి. అందరిచేతా ఇన్సూరెన్స్ పాలసీలు కట్టిస్తుంటానండీ." చెప్పాడు భీమారావు.

"ఐసీ.. కానీ ఇప్పుడు మా కవసరం లేదు."

"అమ్మమ్మ... అంతమాటనకండి. ఈ రోజే కొత్తకారు కొన్నట్లున్నారు. కొత్త భార్య, కొత్తకారు అంటే ప్రతివారికీ ఎంతో మోజు. ఆ మోజుతో మీరు మీ భార్యను పక్కన కూర్చోబెట్టుకుని నూటేభై మైళ్ళ స్పీడుతో కారు తోలుతుంటారు. సడెన్గా లారీ ఎదురొస్తుంది. భార్యతో కబుర్లు చెబుతూ మీరా విషయం గమనించరు. అంతే! కారు తుక్కు తుక్కవుతుంది. మీ కాళ్ళు చేతులు విరగచ్చు. మీరు పాలసీ తీసుకుంటే బోలెడంత డబ్బు." అన్నాడు భీమారావు.

అవాక్కయ్యారు దంపతులు. ముఖంలోని నరాలు ఉబ్బాయి ఇద్దరికీ. నిగ్రహించుకున్నాడు ధర్మరాజు.

"మరి కాళ్ళూ చేతులూ విరిగిన తరువాత లాభమేంటి?" అన్నాడు.

"లాభమా? తిన్నగా అంటారేంటి? ఇక అప్పుడు అన్నీ లాభాలే లాభాలు. మీ లాంటి కోటీశ్వరులు ప్రతిపార్టూ ఇన్సూరెన్స్ చేయించాలి. ఉదాహరణకు చేయి ఒక్కటే విరిగితే రెండు లక్షలు వస్తాయి. రెండు చేతులూ విరిగాయనుకోండి నాలుగు లక్షలు. కాలు విరిగితే ఐదు లక్షలు. రెండు కాళ్ళు విరిగితే పదిలక్షలు. ఒక కాలు ఒక చెయ్యి విరిగితే ఆరు లక్షలు. ఒక కన్నుపోతే పాతిక లక్షలు. రెండు కళ్ళు పోతే ఏభై లక్షలు. ఒక కన్ను ఒక కాలు ఒక చెయ్యిపోతే ముప్పై లక్షలు. నడుం విరిగితే నలభై లక్షల. ఒకవేళ మీ అదృష్టం బాగుండి కాళ్ళు చేతులు, కళ్ళు, నడుం అన్నీ పోయాయనుకోండి అరవై లక్షలు పైచిలుకు వస్తాయి." ఉత్సాహంగా చెప్పాడు భీమారావు.

ధర్మరాజు కళ్ళు అగ్నిగోళాలయ్యాయి. వాడిని తుపాకీతో కాల్చిపారెయ్యకుండా ఇంకా సంభాషణ కొనసాగిస్తున్న భర్తను ఆశ్చర్యంగా చూడసాగింది ధనలక్ష్మి.

"అది సరేనయ్యా... కానీ కళ్ళూ కాళ్ళు చేతులు పోయిన తరువాత ఇక మేము బ్రతికీ ప్రయోజనమేముంది?" అన్నాడు ధర్మరాజు.

పిట్ట బుట్టలో పడుతున్నదని ఊహించిన భీమారావులో ఉత్సాహం పరవళ్ళు తొక్కింది.

"బాగా సెలవిచ్చారు సార్.. ఎంతైనా మేధావులు కదా! అటువంటి హీనమైన బ్రతుకుకన్నా ప్రాణాలు పోవడమే ఎంతో ఉత్తమం. ఒకవేళ ప్రాణం పోయిందనుకోండి" కోటి రూపాయలు మీ వారసులకొస్తాయి. అమ్మగారి ప్రాణం కూడా పోయిందనుకోండి. ఏక మొత్తంగా రెండు కోట్లు ఇప్పిస్తాను. మీ వారసులు కోటీశ్వరులైతే ఆ వచ్చే కమీషన్తో నేను కనీసం లక్షాధికారినైనా అవుతాను. ఈ ఫారం మీద ఒక ఆటోగ్రాఫ్ చెయ్యండి చాలు." ఫారాలు బయటకు తీశాడు భీమారావు.

"ఈ మూర్ఖుడి కాళ్ళూ చేతులూ విరిచి మన కుక్కలకు ఆహారం పెట్టండి" అరిచింది ధనలక్ష్మి.

వెంటనే నలుగురు దృఢకాయులు అక్కడ ప్రత్యక్షమయ్యారు. వాళ్ళ చేతుల్లోని గండ్ర గొడ్డళ్ళను చూసి గుండె దారువంది భీమారావుకు. పిచ్చికుక్కలు తరుముతున్నట్లు ఊహించుకున్నాడు.

* * *

తలుపులు ధనధనమని మోగడంతో తలుపులు తెరిచింది సుందరి. ఎదురుగా రౌద్రాకారంతో నలుగురు ఆజానుబాహులు!

"ఎవరు మీరు? దొంగలా? బందిపోట్లా?" వణుకుతూ అన్నది.

"కాదమ్మా... ఇటో వ్యక్తి పారిపోయొచ్చాడు. వాడి కాళ్ళు చేతులు విరిచి కుక్కలకు పెట్టాలని మా యజమానురాలి ఆదేశం. మీ గోడ దూకాడు." చెప్పారు వాళ్ళు.

" ఎవరూ రాలేదు. ఆడదాన్ని... నా మాట నమ్మండి" ప్రాధేయపడింది సుందరి.

వెంటనే వెళ్ళిపోయారు వాళ్ళు.

మంచం క్రింద నుంచి గజగజలాడుతూ బయటకొచ్చాడు భీమారావు.

"భీమా... ఊళ్ళో వాళ్ళకు ఇన్సూరెన్సులు తరువాత చేయిద్దువు. ముందు అర్జెంటుగా నువ్వు కనీసం పది లక్షలకైనా పాలసీ తీసుకో. త్వరలో ఆ డబ్బు నీ కుటుంబానికందు తుంది. కనీసం వాళ్ళైనా సుఖంగా ఉంటారు. మరోసారెప్పుడూ ఇలా పారిపోయి మా ఇంట్లో దూరకు." బండ బూతులు తిట్టి భీమారావును బయటకు తరిమాడు వెంకట్రావు.